క్లుప్తంగా

వైభవంగా గంగాభవాని నెలపొంగళ్లు



ఉదయగిరి రూరల్: మండలంలోని గంగిరెడ్డిపల్లెలో అనంతపురి గంగాభవాని అమ్మవారి ఆలయంలో నెలపొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. గంగాభవాని అమ్మవారి బ్రహ్మోత్సవాలను నిర్వహించి నెల రోజులు పూర్తికావడంతో విశేష పూజలు నిర్వహించారు. సామూహికంగా మహిళలు పొంగళ్ల సామగ్రిని కొత్తబుట్టల్లో పెట్టుకుని మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ ఏడాది వర్షాలు సకాలంలో సమృద్ధిగా కురిసి పాడి పంటలతో గ్రామం సుభిక్షంగా ఉండేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు విశేష పూజలు



ఉదయగిరి రూరల్: ఆషాడ మాసం రెండో ఆదివారం సందర్భంగా గండిపాళెం జలాశయ ఆవరణలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. గంగమ్మ విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామానికి చెందిన పాముల రాజా, రమాదేవి, నాగేశ్వరరావు, గంగారాణి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ఆత్మకూరు: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక పాదలకూరు కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. మండలంలోని అల్లీపురం, యడవల్లి, నాగులపాడు, రావులకొల్లు, తదితర గ్రామాల్లో ప్రత్యేక వాహనం ద్వారా ప్రచారం సాగించి భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీ కృష్ణయ్య, మధు, గాయత్రి, పద్మమ్మ, భాగ్యమ్మ, శిరీషా, హరిప్రసాద్, వై పెంచలయ్య, నరసారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ఉదయగిరి: ఉదయగిరి పంచాయతీ వార్డు సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గాజుల ఖాదర్‌బాషా కుటుంబ సభ్యులతో కలిసి ఉమ్రా యాత్రకు వెళ్తున్న సందర్భంగా ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్ ఆదివారం ఘనంగా సన్మానించారు. ఉమ్రా యాత్రను దిగ్విజయంగా పూర్తిచేసుకుని రావాలని ఖాదర్‌బాషాను పూలమాల, శాలువాతో సత్కరించారు.

జనావాసంలోకి కణితి



ఈద్గా ప్రాంతంలోని పొదలో నక్కిన కణితి

ఉదయగిరి: పట్టణంలోని దేవలాలగడ్డ ప్రాంతంలోకి సమీప అటవీ ప్రాంతం నుంచి ఓ కణితి దాహార్తితో ఆదివారం వచ్చింది. స్థానికులు గమనించి అటవీ అధికారులకు సమాచారం ఇవ్వగా అటవీ సిబ్బంది లక్ష్మీప్రసన్న, వెంకటేశ్వర్లు, ప్రసాద్ వచ్చి పట్టుకునే ప్రయత్నం చేయగా తప్పించుకుంది. సమీపంలోని ఈద్గా ప్రాంతంలోని ఓ పొదలోకి వెళ్లి నక్కుకుంది. అటవీ సిబ్బంది చాకచక్యంగా కణితిని పట్టుకుని వనంలోకి వదిలారు.

జామాయిల్ ధరలు పతనం

- సిండికేట్‌గా మారిన కంపెనీలు
- కుమ్మక్కైన వ్యాపారులు
- భారీగా ధరలు తగ్గింపు
- రవాణా.. కొట్టుడు ఖర్చులకే సరి
- పెట్టుబడులు దక్కక రైతులు ఆవేదన



వింజమూరులో సాగు చేస్తున్న జామాయిల్ తోట

ఉదయగిరి: కూటమి ప్రభుత్వం కొలువుతీరిన నాటి నుంచి అన్నదాతలకు కష్టాలు రెట్టింపు అవుతున్నాయి. రైతులు పండించే అన్నీ పంటలకు ధరలు లేక పెట్టుబడులు కూడా రాక అల్లాడుతున్నారు. తాజాగా జామాయిల్ ధరలు సైతం భారీగా పతనమవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జామాయిల్ కొనుగోలు చేసే కంపెనీలు సిండికేట్‌గా మారి ధరలను బాగా తగ్గించాయి. దీనికి తోడు వ్యాపారులు సైతం కుమ్మక్కై కొనుగోలు చేయడం తగ్గించారు. భవిష్యత్తులో ధరలు మరింత తగ్గే ప్రమాదం ఉందని చెబుతుండడంతో రైతులు వచ్చినకాడికి తెగనమ్మి నష్టాలు మూట కట్టుకుంటున్నారు.

పదివేల హెక్టార్లలో సాగు

ఉదయగిరి నియోజకవర్గంలో కొండాపురం, కలిగిరి, వింజమూరు, ఉదయగిరి, వరికుంటపాడు, సీతారామపురం మండలాల్లో సుమారు పది వేల హెక్టార్లలో జామాయిల్ సాగులో ఉంది. గత నాలుగేళ్లగా ధరలు ఆశాజనకంగా ఉండడంతో అనేక మంది మెట్టప్రాంత రైతులు సాగువైపు ఆసక్తి చూపారు. కొందరు రైతులు క్లోనింగ్ మొక్కలు సైతం సాగు చేశారు. దీంతో సాగు ఖర్చులు కూడా పెరిగాయి.


కూటమి ప్రభుత్వం వచ్చాక..

గత ప్రభుత్వ హయాంలో అన్ని పంటలతో పాటు జామాయిల్, సుబాబుల్, సవక కూడా మంచి ధరలు పలికాయి. జామాయిల్‌ను టన్ను రూ.9వేల నుంచి రూ.10వేల వరకు కొనుగోలు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జామాయిల్‌కు గిట్టుబాటు ధర కరువైంది. రోజురోజుకూ ధరలు దిగజారుతూ వస్తూ ఏడాదికే సగానికి పడిపోయింది. ప్రస్తుతం టన్ను కర్రను రూ.4 వేలకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో సాగు పెట్టుబడి ఖర్చులు అలా ఉంచితే కూలీలు ,రవాణా ఖర్చులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జామాయిల్ కర్ర

మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి



గత ప్రభుత్వ హయాంలో జామాయిల్ ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఎక్కువ మంది రైతులు సాగు చేపట్టారు. ప్రస్తుతం ధర నేల చూపుచూస్తోంది.టన్ను కర్ర రూ.4వేలకు కొనుగోలు చేస్తున్నారు. కనీసం కూలీలు, రవాణా ఖర్చులు కూడా రావడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి టన్నుకు కనీస మద్దతు ధర రూ.8వేలు ఉండేలా చర్యలు తీసుకోని రైతులను ఆదుకోవాలి.

– గౌస్‌మొయిద్దీన్, దాసరిపల్లి

తాగునీటి వృథాను అరికట్టరూ..



ఉదయగిరి: మండలంలోని కొండాయపాళెం పంచాయతీ పరిధిలోని దుర్గంపల్లి ఎస్సీకాలనీలో రక్షిత మంచి నీటి పథకం వద్ద తాగునీరు లీకై వృథాగా పోతుంది. మరోవైపు వృథా నీటి కారణంగా పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. మురుగు నీటిలో దోమలు ప్రబలుతున్నాయి.ప్రస్తుతం సీజనల్ జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. పంచాయతీ పాలకులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులకు అభినందన

చేజర్ల(ఆత్మకూరు): చేజర్లలోని లుంబిని పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించారు. రెండో విడత కౌన్సెలింగ్‌లో ఉడతా అనూష, వీవీ చరణ్‌రెడ్డి ఒంగోలు క్యాంపస్‌లో సీట్లు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఆదివారం అభినందించారు.

ప్రజాసమస్యలను పరిష్కరించాలని వినతి

ఉదయగిరి: జిల్లాలో అత్యంత వెనుకబడి ఉన్న ఉదయగిరి నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలని ఉదయగిరి డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధులు వీ రామచంద్రమూర్తి, ఎండీ ఖాజా కోరారు. ఈ మేరకు మండలంలోని గంగిరెడ్డిపల్లికి ఆదివారం వచ్చిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను కలిసి వినపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలోని రైతులు చిన్న సాగునీటి వనరులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. అందువల్ల వర్షాకాలంలో పడిన ప్రతినీటి బొట్టు వృథా కాకుండా చెరువులు, చెక్‌డ్యామ్‌లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కోరారు. గండిపాళెం, మర్రివూట్ల, నక్కలగండి రిజర్వాయర్లు, ప్రధాన కాలువలను ఆధునీకరించాలని విజ్ఞప్తి చేశారు. ఉదయగిరి, వింజమూరులోని 30 పడకల ఆస్పత్రులను 100 పడకలకు పెంచాలని, ఉదయగిరి ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఉదయగిరి, కొండాపురం, తెల్లపాడు, చినక్రాక గ్రామాల్లోని యూనాని, ఆయుర్వేద వైద్యశాలలు వైద్యులు లేక మూతపడ్డాయని, ఆయుష్ శాఖ ద్వారా వాటిని తెరిపించి ప్రజలకు వైద్యం అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. సాంకేతిక విద్యాపరంగా ఉదయగిరి నియోజకవర్గం వెనుకపడి ఉందని పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయించాలని కోరారు. గంగిరెడ్డిపల్లిలో మంజూరైన మైనార్టీ బాలికల పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. నియోజకవర్గంలో చిన్నపరిశ్రమలను ఏర్పాటు చేసేలా ఔత్సాహికులను ఆహ్వానించి ప్రోత్సహించాలన్నారు. ఉదయగిరి దుర్గాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చొరవచూపాలని కోరారు.



ఎమ్మెల్యే కాకర్లకు వినతిపత్రం అందజేస్తున్న యూడీఎఫ్ ప్రతినిధులు

ముగిసిన వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలు



జలదంకి: బ్రాహ్మణక్రాకలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఆరు రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి ఏకాంతసేవతో ముగిసాయి. ఉదయం 8 గంటలకు 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. భక్తులు ఊరేగింపుగా 108 కలశాల్లో జలాలను తీసుకొచ్చి అభిషేకం చేశారు. అనంతరం స్థానిక శివాలయం వద్ద ఉన్న కోనేరులో బ్రహ్మోత్సవాలతో అలిసిపోయిన వేణుగోపాలస్వామికి చక్రస్నానం జరిపారు. సాయంత్రం పుష్పయాగాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. రాత్రి ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలను ముగించారు.

శివప్రసాద్ సేవలు ఎనలేనివి

ఆత్మకూరు: ఆత్మకూరు విద్యుత్ శాఖలో ఉద్యోగిగా పనిచేస్తూ గత నెల 30న ఉద్యోగ విరమణ పొందిన జీ శివప్రసాద్‌ను పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఘనంగా సన్మానించారు.స్రైడ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు వాగాల శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి జిల్లా సీపీఎం పార్టీ కార్యదర్శి మూలం రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆత్మకూరు విద్యుత్ శాఖ ఉద్యోగిగా శివప్రసాద్ అందించిన సేవలు ఎనలేనివన్నారు. ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జీ శివప్రసాద్ విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఉద్యోగ విరమణ తరువాత ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు సేవలు అందిస్తానని ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు గంటా లక్ష్మీపతి, నాగయ్య, డేవిడ్‌రాజు, ఎస్దానీ, నాగేంద్ర, మహేష్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



శివప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నారుమడికి చీరల రక్షణ



రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. కావలి రూరల్ మండలం గౌరవరం ప్రాంతంలో రెండో పంట సాగుకు రైతులు నారుమడులను పోసుకున్నారు. కొందరు రైతులు అడవి పందులు, పశువులు పాడుచేయకుండా చీరలతో రక్షణ కంచెను ఏర్పాటు చేసుకున్నారు. రంగురంగుల చీరెలతో ఏర్పాటు చేసుకున్న కంచె చూపరులను ఆకట్టుకుంది.

– కావలి (జలదంకి)

శాకంబరిగా గంగమ్మ



సంగం: స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న గంగమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారిని పండ్లు, కూరగాయలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిసేవ జరిపారు. ఈ కార్యక్రమానికి ధనేంకుల సుధాకర్ యాదవ్, సుస్మిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

దుత్తలూరు: మండలంలోని గిరిజనుల కోసం సోమవారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ హనుమంతరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరేళ్లలోపు గిరిజన పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రం ఆధారంగా కొత్తగా ఆధార్ నమోదు చేస్తారని చెప్పారు. ఆరేళ్ల పైబడిన వారికి తహసీల్దార్ జారీ చేసే డొమైసిల్ సర్టిఫికెట్ ఆధారంగా ఆధార్ నమోదు చేస్తారని తెలిపారు. అలాగే ఆధార్‌కార్డు పోగొట్టుకున్న వారికి మళ్లీ కొత్తగా ఆధార్‌కార్డును మంజూరు చేస్తారని చెప్పారు. 14,15 తేదీల్లో దుత్తలూరు బిట్–1 సచివాలయం, 16,17 తేదీల్లో నర్రవాడ, 18,19 తేదీల్లో నందిపాడు సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇతర సచివాలయ సిబ్బంది ప్రత్యేక చొరవచూపి ఆధార్‌లేని గిరిజనులను గుర్తించి మంజూరు చేయించాలని కోరారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి చేయాలి

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కే పుష్పాంజలి పిలుపునిచ్చారు. పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీ సభ్యత్వాలను ముమ్మరం చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని సూచించారు. అనంతరం ఆత్మకూరు నియోజకవర్గ పార్టీ లీగల్ అడ్వైజర్‌గా జే శ్రీనివాసులు, ఆత్మకూరు మండలాధ్యక్షుడిగా హజరత్తయ్యను నియమించారు. ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి టీ కృష్ణ, ఆత్మకూరు పట్టణాధ్యక్షుడు బీ శేషాద్రి పాల్గొన్నారు.



అధ్వానంగా పారిశుధ్యం



దుత్తలూరులో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

దుత్తలూరు: రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ పేరుతో గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని నిత్యం ఊదరగొడుతున్నా క్షేత్రస్థాయిలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టడం లేదు. ఈ పరిస్థితి దుత్తలూరు పంచాయతీలో స్పష్టంగా కనిపిస్తోంది. ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించి వర్మికంపోస్టు తయారు చేయాల్సి ఉన్నా కనీసం చెత్తను సేకరిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. దీంతో ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్తను పడవేస్తున్నారు. ఫలితంగా పరిసరాలు కలుషితం కావడమే కాక దోమలు విజృంభించి వ్యాధులు సంక్రమిస్తున్నాయి. మండల పరిషత్ కార్యాలయం పక్కనే డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవల రూ.3 లక్షలు నిధులు వెచ్చించి రేకుల షెడ్డు సైతం వేశారు. అయితే ఇంటింటి చెత్తను సేకరించి ఇక్కడికి తరలించే ప్రక్రియ జరగడం లేదు. ఎవరైనా అధికారులు తనిఖీలకు వస్తారేమోనన్న అనుమానంతో ఇతర ప్రాంతాల నుంచి పశువుల ఎరువు తెచ్చి నాలుగు తొట్టెల్లో తూతూ మంత్రంగా పరిచారు. సంపద కేంద్రంలో మందుబాబులు తాగి వర్మికంపోస్టు తొట్టెల్లో సీసాలను పడేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. అంతేకాక మండల పరిషత్ కార్యాలయ పరిసరాలు చెత్తాచెదారంతో నిండి ఉన్నాయి. దుత్తలూరు చెరువు సమీపంలోని అలుగు వాగులో గ్రామస్తులు చెత్తను పడవేస్తున్నారు. మరోవైపు దుత్తలూరు సెంటర్ ప్రాథమిక పాఠశాల వద్ద డ్రైనేజీ పూడికతో నిండి దుర్గంధం వెదజల్లుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్యం కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.



పూడికతో దుర్గంధం వెదజల్లుతున్న డ్రైనేజీ



సంపద కేంద్రంలోని వర్మికంపోస్టు తొట్టెలో ఖాళీ మద్యం బాటిళ్లు

చెరువు మట్టి అక్రమ తరలింపు

ఉదయగిరి: వరికుంటపాడు మండలం జీ కొండారెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి ఇరిగేషన్ చెరువులోని మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ఆదివారం అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి లేఅవుట్ కోసం జేసీబీ సాయంతో ట్రాక్టర్ల ద్వారా పెద్ద ఎత్తున తరలించారు. గండిపాళెం–ఉదయగిరి రోడ్డు మార్గంలోని జీ కొండారెడ్డిపల్లి వద్ద కొత్తగా వేస్తున్న లేఅవుట్‌కు చెరువు మట్టిని పట్టపగలే తరలిస్తున్నా అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ట్రాక్టర్(2.5క్యూ.మీ)మట్టికి గనులు, ఇరిగేషన్ శాఖలకు రాయిల్టీ రూపంలో రూ.450 నగదును ప్రభుత్వ ఖజానాలో జమ చేయాలి. కానీ ఈ తంతు ఏమీ లేకుండానే అక్రమంగా మట్టి తరలిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. మట్టి అక్రమ తరలింపుపై మీడియా ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చినా కూడా అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. మట్టి తరలిస్తున్న వ్యక్తితో ఇరిగేషన్ ఏఈ మాట్లాడినా వారు ఖాతరు చేయలేదు.అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చిన ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. తాము స్వయంగా అడ్డుకుంటే రాజకీయపరమైన ఇబ్బందులు తలెత్తుతాయని మిన్నకుండిపోయారు. సామాన్యుడు తన అవసరాల కోసం తట్ట మట్టి కావాలంటే ముందుగా ఎమ్మెల్యే కార్యాలయం నుంచి అనుమతి తీసుకొండి అనే చెప్పే రెవెన్యూ, పోలీసులు అధికారులు ప్రస్తుతం మట్టి అక్రమంగా తరలిస్తున్నా మౌనం వహించడంలో రహస్యం ఏమిటో వారికే తెలియాలి. లేఅవుట్లకు అక్రమ మట్టి తరలింపును అడ్డుకుంటున్నట్లు చెప్పే ఎమ్మెల్యే కార్యాలయ పరివారం ఈ విషయంలో ప్రజలకు ఏమీ సమాధానం చెబుతారో వేచిచూడాల్సిందే. మట్టి అక్రమ తరలింపుపై వింజమూరు ఇరిగేషన్ డీఈ టీ రమణారావును వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



కొత్తపల్లి చెరువులోని మట్టిని జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

స్కాన్ చేయండి..చందా ఇవ్వండి



క్యూఆర్ కోడ్‌ను చూపుతూ చందాలు అడుగుతున్న చిన్నారులు

వినాయక చవితికి నెలరోజుల ముందు నుంచే చందాలు దండడం పరిపాటి. చిన్నారులు సైతం రోడ్లపై తాళ్లు అడ్డం పెట్టి ప్రయాణికుల వద్ద చందాలు అడుగుతుంటారు. వచ్చే నెలలో రానున్న వినాయక చవితిని దృష్టిలో ఉంచుకుని ఆత్మకూరు–చేజర్ల మార్గంలోని పుట్టుపల్లి వద్ద ఆదివారం కొందరు చిన్నారులు డిజిటల్ టెక్నాలజీని వాడుకుంటూ చందాలు వసూలు చేస్తూ కనిపించారు. నగదు లేకుంటే స్కాన్ అయినా చేయండి సారూ అంటూ యూపీఐ క్యూఆర్ కోడ్‌ను అంటించిన ఓ అట్టను ప్రదర్శిస్తూ చందాలను అడగడంతో ఆశ్చర్యపోవడం ప్రయాణికుల వంతైంది.

– ఆత్మకూరు